International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March, 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# మానవత్వపు పరిమళాన్ని అందించే 'మధురాంతకం రాజారాం' కథలు

డా. పొట్లూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి,
ఏలూరుజిల్లా - 534460
చరవాణి: 9390883982
మెయిల్:johnveslyp@gmail.com

**ఉపోద్ఘాతం:**

అనుభూతుల్ని, అనుభవాల్ని అక్షరాలకు ఆపాదించి అనంత సాహితీసాగరాన్ని మథించిన ప్రముఖ కథకుల్లో చిత్తూరుజిల్లాకు చెందిన మధురాంతకం రాజారాంగారు అగ్రగణ్యులు. ఇతరభాషాసాహిత్యాల ప్రభావానికి లోనుకాకుండా తెలుగుదేశపు మట్టివాసనను కథలనిండా పరిచి పాఠకులను మంత్రముగ్ధులను చేయడంలో మధురాంతకం వారి కథా నిర్మాణశైలి ఎన్నదగింది. 1930 అక్టోబర్ 5వ తారీఖున చిత్తూరుజిల్లాలోని రమణయ్యగారిపల్లెలో జన్మించారు. 1948లో టీచర్ ట్రైనింగ్ పూర్తయిన తర్వాత ఆయన మొగరాల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియమించబడ్డారు. పాకాలలో 1964లో వార్డెన్'గా, 1965లో దామల్ చెరువు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా, 1978 నుండి 1988 వరకూ చిత్తూరుజిల్లాలోని కొటాల, కొమ్మిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉద్యోగవిరమణ పొందారు. సుమారు 40 సంవత్సరాలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన అనుభవం వీరిది. 1955లో మేనమామ దైవశిఖామణి పిళ్లైగారి పెద్దకూతురు నాగభూషణమ్మగారి వివాహం చేసుకున్నారు.

**సాహితీ వ్యాసంగం:**

హైస్కూలు చదివేరోజుల్లోనే చిత్తూరులోని సాహితీకారుల పరిచయంతో చిన్ననాటనుండే సృజనాత్మక రచనలు చేయడం మొదలుపెట్టారు. హైస్కూలుజీవితం పూర్తిచేసే నాటికి మహాభారతం, రంగనాథరామాయణం, భాగవతంలాంటి కావ్యాలను చదువుకున్నారు. 1948లో తొలికథ చిత్రగుప్త పత్రికలోనూ, 1959-55 మధ్యకాలంలో ఆయన రాసిన కథలు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, జాగృతి, సైనిక సమాచార్ వంటి పత్రికల్లో ప్రచురించబడ్డాయి. 1961లో వర్షించిన మేఘం పేరుతో రాజారాంగారు రాసిన తొలి కథాసంపుటాన్ని పద్మప్రియ ప్రచురణాలయం వారు ప్రచురించారు. ఇక అప్పటి నుండీ జీవితంలోని అనేక ఘట్టాలను, సన్నివేశాలను తీసుకుని అనేక కథలను వెలువరించారు. 1991-2008 మధ్య కాలంలో వెలువరించింది. ఆయన రాసిన కథలన్నీ దాదాపు 300 పైగా వుంటాయనే అంచనాను బట్టి కథా రచయితగా వారి ప్రతిభను అంచనా వేయవచ్చు. కేవలం కథలు మాత్రమే కాకుండా "చిన్న ప్రపంచం సిరివాడ", 'త్రిశంకుడి స్వర్గం" అనే రెండూ నవలలు, ఇంకా మరెన్నో సాహిత్యవ్యాసాలు కూడా ఆయన రాశారు. ఆయన రాసిన సాహిత్య వ్యాసాలు 'కథాయాత్ర" పేరుతో పుస్తకరూపంలో వచ్చాయి. అంతేగాక తమిళ రచయిత అఖిలన్ రాసిన "తిరుప్పావై" అనే నవలను "చిత్రసుందరి" అనే పేరుతో తెలుగులోకి అనువదించారు. ఈ గ్రంథానికి తంజావూరు తమిళ విశ్వవిద్యాలయం వారి ఉత్తమ అనువాదగ్రంథం అవార్డును పొందారు.

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-3, March, 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

**3. కథావైశిష్ట్యం:**

రాజారాంగారికి తను పుట్టి పెరిగిన పల్లెటూరంటే ఎంతో అభిమానం. అటువంటి గ్రామీణ ప్రాంతపు జీవితాన్ని, సంస్కృతిని తన కథలకు వస్తువుగా మలచుకున్నారు. అచ్చమైన తెలుగుదనంలోని మట్టివాసనలు ఆయన కథల్లో గుబాళిస్తాయి. వారి మృదువైన శైలి పాఠకులను మరోలోకంలోకి తీసుకెళ్తుంది. తీసుకున్న ఇతివృత్తాన్ని వివరించడానికి ఎంచుకున్న సుందరమైన వాక్యనిర్మాణ పద్ధతి పాఠకులలో ఉత్సుకతను రేకెత్తిస్తుంది. పల్లెల్లో జీవించే మనుష్యుల జీవితాలను వివరించినా, పేదరైతులు, కష్టజీవుల వెతల్ని ఇతివృత్తంగా తీసుకున్న ఆ కథను ఆయన నడిపే తీరు గమ్మత్తుగా వుంటుంది. పాఠకులకు బాగా పరిచితమైన సామాజిక జీవితచిత్రాన్నే మళ్లీ కొత్తగా తన కథల ద్వారా తెలియజేస్తారు. తేలికైన పదాలను లలితసుందరంగా ప్రయోగించి పాఠకుల జీవితానికి దగ్గరౌతారు. అందుకే సమాజంలోని ఏ పాత్రను తీసుకున్నా దానిపై ఆయన ముద్ర వుండేలా ప్రయత్నిస్తారు. అందుకే రాజారాంగారి కథలు తెలుగు పాఠకులకు, కథకులకు కూడా సర్వదా ఆత్మీయమై అజరామరంగా నిలిచిపోయాయనడంలో సందేహంలేదు.

**4. మనసుకు హత్తుకునే కొన్ని కథల పరిచయం:**

ఏ రచయితకైనా కథానిర్మాణంలో తనకంటూ ఒక ప్రత్యేకశైలి వుంటుంది. తాను విన్నదాన్నో, చూసినదాన్నో కథగా మలచి పాఠకులకు దగ్గరయ్యేలా రాయడానికి కొన్ని పాత్రల్ని చిత్రిస్తారు. ఆ పాత్రలద్వారా కొన్ని విషయాలలోనైనా సమాజాన్ని మార్చాలనే తాపత్రయం వుంటుంది. సమాజంలోని మంచినీ, మనుషుల్లోని మానవత్వాన్నీ, కరుణనూ, దయనూ తన కథలద్వారా పాఠక ప్రపంచానికి, సమాజానికి తెలియజేశారు రాజారాంగారు. ఈ సమాజాన్ని సౌజన్యం, మానవత్వం, సంస్కారంలాంటి ఉత్తమగుణాలు కూడా నడిపిస్తాయనే జీవితసత్యాన్ని పాఠకులకు తెలియజెప్పాలనే ఆర్తి, తపన రాజారాంగారి కథల్లో కనిపిస్తుంది. అంతేకాగ మనుషుల్లోని సంకుచితత్వాన్ని, స్వార్థపరత్వాన్ని, రాక్షసత్వాన్నీ, అమానవీయతనూ నిరసిస్తూ అనేక కథలు రాశారు. అదే సమయంలో సమాజ జీవితంలోనూ, వ్యక్తులలోనూ దాగియున్న మంచి, మానవత్వం అనే పార్శ్వాలను స్పృశిస్తూ అనేక వాస్తవ పాత్రలను ఆయా కథల్లో ప్రవేశపెట్టి తన కథల్ని పరిపుష్టం చేశారు రాజారాంగారు. అటువంటి కథల్లో కొన్ని కథలనూ, వాటిలో పాఠకుల గుండెల్ని తడిమిన పాత్రలను పరిచయం చేయడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

**4.1. భగవంతుడి జాబితా:**

సమాజంలో విభిన్న మనస్తత్వాలున్న మనుషులను మనం చూస్తుంటాం. బ్రతికున్నంత కాలం ఏమి సంపాదించాం, ఎలా జీవించామనే విషయాలమీదే మన మనసుంటుంది. కానీ మనల్ని నిరంతరం భగవంతుడు గమనిస్తు న్నాడని, మనం చేసిన, చేస్తున్న మంచిపనులను దేవుడు తన జాబితాలో రాసుకుంటాడనే విషయం మనకు తెలిసినా దాని గురించి మనం అంతగా పట్టించుకోము. అటువంటి విషయాన్ని తీసుకుని అత్యంత హృద్యంగా మనసుకు హత్తుకునేలా రాస్తారు రచయిత.

ఈ కథలోని నెటాలం సాయిబు పాత్రను ఎంతో ఔదార్యం వున్న పాత్రగా మాత్రమే కాకుండా ఆదర్శవంతమైన పాత్రగా కూడా తీర్చిదిద్దారు రచయిత. బాడుగలకు ఎద్దులబండిని తోలుతూ జీవితాన్ని సాగించే నెటాలం సాయిబు ఒకరిని ఆశించకుండా, ఒళ్లు దాచుకోకుండా ఎంతో కష్టపడి నలుగురు కొడుకులనూ, ముగ్గురు కూతుళ్లనూ

పెంచి వాళ్లకు పెళ్లిళ్లు చేసి వాళ్లు బ్రతకడానికి అవసరమైన ఏర్పాట్లుచేసి ఊరి బయట తనకున్న స్థలంలో పాకవేసుకుని చెట్లు పెంచుకుని ఆశ్రమ జీవితాన్ని గడిపే కర్మయోగిలా కనిపిస్తాడు. నెటాలం సాయిబు వుండే ఊరికి హైస్కూలు మంజూరవుతుంది. కానీ ఆ స్కూలుకు స్థలాన్ని కేటాయించడానికి గ్రామస్తులు ముందుకు రాకపోవడంతో తన పాకచుట్టూ వున్న ఖాళీస్థలంలో క్లాసులు నిర్వహించుకోవడానికి అనుమతిస్తాడు సాయిబు. క్రమంగా ఆ స్కూలు పిల్లలతో ఏర్పడిన అనుబంధం కారణంగా ఆ స్థలాన్ని పాఠశాలకే రిజిష్టర్ చేయిస్తాడు. తన మరణానంతరం ఆ స్కూలుకు అవసరమైన గదుల్ని నిర్మించాలని వీలునామాలో రాయిస్తాడు. అతడు చనిపోయాక లాయరుద్వారా ఆ వీలునామా చూస్తారు. కనీసం ఆ గదులకు తన పేరైనా పెట్టమనే కోరిక కూడా కోరకుండా తనకున్న అస్తి మొత్తం దానంచేసిన నిష్కామకర్మయోగి నెటాలం సాయిబు. సమాజంలో మంచి ఏదో ఒక రూపంలో వుంటుందని తెలియజేస్తాడు రచయిత. పేరుకోసమో, పుణ్యంకోసమో కాకుండా భగవంతుడి జాబితాలో తన పేరు వుంటుందిని నమ్ముతాడు సాయిబు. కనుక చేసే దానం గుప్తంగా వుంటే దానికి విలువా గౌరవం వుంటుందనే ఆశాభావం ఈ కథలో కనిపిస్తుంది.

**4.2. పిచ్చి వెంకట్రావు:**

మనిషిలోని మంచితనానికి పెద్దపీట వేసిన కథల్లో పిచ్చి వెంకట్రావు కథ ఒకటి. స్కూలు హెడ్మాస్టరైన వెంకట్రావు రూల్సుకంటే కూడా మనిషి ముఖ్యమని భావిస్తాడు. తాను నమ్మిన ధర్మాన్ని లోకం కోసం కాకుండా మనిషికోసం ఆచరిస్తాడు. కానీ ఆయన మంచితనాన్ని అర్థంచేసుకోని లోకం ఆయన్ని పిచ్చివెంకట్రావు అని ముద్రవేస్తుంది. ఈ కథలో ప్రాణాపాయ స్థితిలో వున్న ఒక మనిషిని కాపాడడానికి రూల్సుని వ్యతిరేకించే మనిషిగా వెంకట్రావు కనిపిస్తాడు. ఒక సహోపాధ్యాయుడు తీవ్ర అనారోగ్యంతో వుంటే అతణ్ని ఆస్పత్రిలో చూపించడానికి ఎద్దులబండిలో వేసుకుని రైల్వేస్టేషనుకి తీసుకెళ్ళి అక్కడినుండి పట్నంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకుంటాడు. కానీ అప్పటికే ట్రైను బయల్దేరుతుంది. ఆ ట్రైన్ గనుక వెళ్ళిపోతే మనిషి ప్రాణాలు పోయేలా వున్నాయని భావించిన వెంకట్రావు ఆ రైలుకు అడ్డంగా వెళ్లి ఆపడానికి ప్రయత్నిస్తాడు. ఈ వెంకట్రావు ప్రయత్నాన్ని చూసిన అక్కడివారందరూ ఈయనకు పిచ్చి బాగా ముదిరిందని అపోహపడతారు. కానీ ఆశ్చర్యంగా రైలు ఆగుతుంది. ఆ ట్రైన్ డ్రైవర్ ఒకప్పటి వెంకట్రావు శిష్యుడు. అతడు చదివే సమయంలో అతనికి వచ్చిన సమస్యను వెంకట్రావు పరిష్కరించి అతని చదువు ముందుకు సాగడానికి సహాయంచేస్తాడు. రోగికి సరైన సమయానికి వైద్యం అంది అతడు ప్రాణాపాయం నుండి బయటపడడంలో వెంకట్రావు పాత్రను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు రచయిత. లోకమంతా ఇలాంటి పిచ్చి వెంకట్రావులతో నిండిపోతే సమాజం ఎంత ఉన్నతిని సాధిస్తుందో అనే స్పృహను ఈ కథ కలిగిస్తుంది.

**4.3. సంస్కారం:**

మనిషి ఎంత సంపాదించి ఎన్ని దేశాలు తిరిగినా ఆపదలో అతనికి సహాయం చేసే మనిషి దగ్గర లేకపోతే ఆ డబ్బు వృథా అనే కోణంలో రాసిన సంస్కారం అనే కథ మనిషిని ఆలోచనలో పడేస్తుంది. ఈ కథలోని కామేశాన్ని మనుషులంతా మంచివాళ్లే అనే నమ్మకమున్న అమాయకమైన పాత్రగా రూపుదిద్దాడు రచయిత. తన స్నేహితుడైన రమాపతి ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చిన ఊర్లోనే కామేశం మెకానిక్'గా పనిచేస్తుంటాడు. వీళ్లిద్దరూ ఒకప్పటి బాల్యస్నేహితులు.

బజారులో వెళ్తున్న రమాపతికి ఒకసారి అనుకోకుండా కామేశం తారసపడతాడు. కానీ కామేశం మాటతీరు, పేదరికం, అతని మాటల్లోని ఆత్మాయతాభావం రమాపతికి నచ్చదు. తరచూ రమాపతి ఇంటికి వచ్చి అతను భార్యను సోదరిగా భావించి మాట కలుపుతుండే కామేశం వైఖరి నచ్చక అతన్ని దూరంపెడతాడు. ఈ విషయాన్ని గ్రహించిన కామేశం కూడా రమాపతికి దూరంగానే వుంటాడు. అయితే నెలలు నిండిన రమాపతి భార్యకు నొప్పులు ప్రారంభం కావడంతో సహాయంకోసం అత్తగారిని తీసుకురావడానికి ఊరెళ్తాడు రమాపతి. కానీ అత్తగారి కుటుంబమంతా తీర్థయాత్రలకు వెళ్లారని తెలిసి దిగులుగా ఇంటికి తిరిగివస్తాడు రమాపతి. అప్పటికే కామేశం అతని భార్యా చేసిన సహాయం వల్ల రమాపతికి పండంటి కొడుకు జన్మించాడని చెప్తారు కామేశం దంపతులు. ఆ మాటలకు ఎంతో ఆనందపడిన రమాపతి వాళ్లకు తను చేసిన అవమానాలకు సిగ్గుపడతాడు. రమాపతికి పుత్రోదయంతో పాట్టు జ్ఞానోదయం కూడా అయిందని చెప్తాడు రచయిత. సాటి మనిషిని మనిషిగా గుర్తించి సహాయం చేసే సంస్కారం మనిషిలో వుండాలని చెప్తుంది ఈ కథ.

**4.4. జగమేలే పరమాత్మ! ఎవరితో మొరలిడుదు:**

మనిషిలోని విలువల్ని మరోసారి గుర్తుచేసే కథ ఇది. ప్రతీ మనిషి తాను నమ్మిన విలువల కోసం ఎంతో పాటుపడాలి అనే తాపత్రయం ఈ కథలో వ్యక్తంచేశారు రచయిత. మనిషి జీవితానికి సంపాదన అవసరమే అయినా ఆ సంపాదన కోసం మనుషుల్ని తిరస్కరించడం, గేలిచేయడం మంచిది కాదనే సందేశాన్ని ఇచ్చిన కథ ఇది. గొప్ప సంగీత విద్వాంసుడైన అనంతనారాయణశాస్త్రి ఈ కథలో కీలక పాత్రధారి. ఆయన తనకున్న గానమనే కళ ద్వారా బోధించే విలువలేమిటో ఆలోచించుకోమనే బోధ కనిపిస్తుంది. రసతరంగిణి అనే సాంస్కృతిక సంస్థను ఏర్పాటుచేసిన శ్రీనివాసమూర్తి అనంత నారాయణశాస్త్రి కచేరీ ఏర్పాటుచేస్తాడు. అయితే పరిస్థితుల ప్రాబల్యం వల్ల అనంత నారాయణ శాస్త్రికి ఇస్తానని ఒప్పుకున్న ఐదువేల రూపాయలకు బదులుగా మూడువేల రూపాయలే ఇస్తాడు. అది చూసిన అనంత నారాయణశాస్త్రి ఎంతో కోపానికి గురవుతాడు. తన కాలిదగ్గరున్న స్టూలును తన్నడమే కాకుండా తనకిచ్చిన సన్మానపటాన్ని కిందపడవేసి ముక్కలు చేస్తాడు. 'శాంతము లేక సౌఖ్యము లేదు' అనే కీర్తన ఆలపించిన ఆయన డబ్బు తక్కువుందనే కారణంగా సభలో నానా రభస సృష్టిస్తాడు. అందుకే ఎటువంటి మనషులు సమాజానికి అవసరం అనే సందర్భంలో సన్మానపత్రంలో 'సంగీత విద్వాంసులుగా ఎంతటి గొప్పవారో మనిషిగా అంతటి హీనులు మీరు. మానవత లేని మేధావులకన్నా మంచితనం కలిగిన మానవులే సమాజానికి అవసరం' అనే వాక్యంద్వారా మనిషిలో మంచితనం విలువను చాటిచెప్తాడు రచయిత. మనకున్న కళైనా, మరే ఇతర ప్రతిభైనా సమాజ ఔన్నత్యంకోసం ఉపయోగపడాలనే మంచి సందేశం ఈ కథలో కనిపిస్తుంది.

**4.5 చీమలు పెట్టిన పుట్టలు:**

గ్రామీణ వైద్యుడైన వెంకటరామయ్య నేటి వైద్యులందరికీ ఆదర్శవంతమైన పాత్ర. అవసరం వున్నా లేకపోయినా టెస్టుల పేరుతో జనాల్ని నిలువుదోపిడీ చేస్తున్న నేటి వైద్యులకి, అవకాశం వున్నా తన వైద్యం జనాలకు ఉపయోగపడాలి తప్ప డబ్బుకు ప్రాధాన్యతనివ్వని వెంకటరామయ్యకి ఎంతో తేడా ఈ కథలో మనకు కనిపిస్తుంది. ఈయన పూర్వీకుల నుంచి వస్తున్న వైద్యవృత్తినే ఆధారంగా చేసుకుని బ్రతుకుతుంటాడు. కానీ సంపాదన లేకపోవడంతో అప్పులు బాగా పెరిగిపోతాయి. ఒకసారి దారిప్రయాణంలో రంగనాథయ్య అనే సంపన్నుడికి వచ్చిన కడుపునొప్పికి మందిస్తాడు వెంకట రామయ్య.

ఆ మందుద్వారా కడుపునొప్పి తగ్గడంతో అందుకు ప్రతిఫలంగా ఇరవై రూపాయలు ఇవ్వబోతాడు రంగనాథయ్య. కానీ అందుకు నిరాకరించిన వెంకటరామయ్య "అబ్బే... నా మందుకంత విలువలేదండీ. రెండోమూడో ఇప్పించండి. లేనిపోని దురాశలకెళ్తే వైద్యం ఫలించదండీ' అంటాడు. 'కానీ నువ్వు చేసిన ఈ వైద్యానికి మరో వైద్యుడైతే ఏ ఏ యాభయ్యో అరవయ్యో ఇచ్చేదాకా వదలరు' అంటాడు రంగనాథయ్య.అప్పుడు వెంకటరామయ్య 'మీరు కలిగిన వాళ్లు కాబట్టి మీ దగ్గర ఎంత గుంజుకున్నా పరవాలేదని నేననుకోలేను బాబూ. నా కష్టానికి ప్రతిఫలం దక్కితే చాలు..' అంటూ చెప్పే మాటలు ఈనాటవైద్యుల డబ్బు సంపాదన యావకి గొడ్డలిపెట్టులాంటిది. అందుకే సంపాదించే అవకాశం ఉన్నా విలువలకు కట్టుబడిన మనుషుల్ని పరిచయం చేసి మనలో ఆలోచన కలిగిస్తారు రచయిత.

**ముగింపు:**

దాదాపు మూడువందలకు పైగా కథలు రాసిన మధురాంతకం రాజారాం గారి కథల్లో పైన చెప్పినవి కొన్ని మాత్రమే. రచయితకు ఒక సామాజిక బాధ్యత వుందనే విషయాన్ని రచయితలు విస్మరించరాదనే తపన ఆయన కథల్లో కనిపిస్తుంది.అందుకే సాహిత్యం సమాజంలో కొన్ని విలువల్ని నెలకొల్పడానికి పూనుకోవాలనే అభిప్రాయం కలిగిన వాడు కనుకనే సమాజంలోని అనేక అంశాలను ఇతివృత్తంగా తీసుకుని వాటిని కథలుగా మలిచి రచయితగా తన బాధ్యతను నెరవేర్చారు. తాను చూసిన జీవితాలను శక్తవంతమైన తన దృక్కోణంతో సూక్ష్మాతిసూక్ష్మంగా పరిశీలించిన నైపుణ్యం ఆయన కథల్లోమనకు కనిపిస్తుంది. తాను సృష్టించని పాత్రలన్నీ తన నిజజీవితంలో తారసపడిన పాత్రలుగానే ఆయన భావిస్తారు. సంపాదనకంటే ఇతరులకు సహాయం చేయడం గొప్ప అనే విషయాన్ని కథల్లో నిరూపించి అటువంటి మంచి సమాజాన్ని మనషి తల్చుకుంటే చూడగలడని చెప్తాడు. మనిషి అనుభవించే అన్ని పరిస్థితులకూ మనిషే మూలమని మధురాంతకం నమ్ముతారు.అందుకే ఆయన కథలు మనిషిలోకి వెళ్ళి గుండెతడిని ఆర్ద్రంగా తట్టిలేపుతాయి. మంచితనానికి నిలువెత్తు నిదర్శనంలా మనల్ని ముందుకు నడుపుతాయి.

...............

1. మధురాంతకం రాజారాం కథలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.

2. అందాల తెలుగుకథ, నవభారతి సాహిత్య వేదిక, సాహిత్య నికేతన్.

3. కథానికా స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి, మొదటి కూర్పు, 1988, నవోదయా పబ్లిషర్స్, విజయవాడ.

4. కథాశిల్పం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, 1995, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్-1.

5. జాగృతి కథలు - సమగ్ర పరిశీలన, (2001-10) సిద్ధాంతగ్రంథం, డా. శంకర్ అనంత్, జాతీయ సాహిత్య పరిషత్, భాగ్యనగర్ శాఖ, తెలంగాణ